సాక్షి
వికారాబాద్

సోమవారం । 31 । జూలై । 2023



అడుగడుగునా గండం!

రహదారులు అధ్వానంగా మారాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. 8లో▸



వైభవంగా రుక్మిణీ కల్యాణం

బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. 8లో▸



బాధితులను ఆదుకుంటాం

వర్షాలకు కూలీన ఇళ్ల బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

బసవేశ్వర భవన్‌కు రూ.10 లక్షలు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఎమ్మెల్యేతో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు

పరిగి: వీరశైవుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన్ను వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బసవేశ్వరుడి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో బసవేశ్వర భవన్ నిర్మాణం కోసం తనవంతుగా రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

గుండ్లకుంటను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లు నిత్యం సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎంతో మందికి లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రైతు బంధు డబ్బు అన్నదాతల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రమేశ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అంజాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్ల బాగుకు ప్రణాళిక

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



కాలనీ సమస్యలు తెలుసుకునేందుకు బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే ఆనంద్, నాయకులు

వికారాబాద్ అర్బన్: పట్టణంలో లింకు రోడ్లను బాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. ఆదివారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరయ్యాయని, వాటితో లింకు రోడ్లను బాగు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



చర్చి పరిసరాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

అనంతగిరి: ఎస్పీ ఆదేశాల మేరకు వికారాబాద్ పట్టణ పరిధిలోని అనంతగిరిగుట్ట, రైల్వే స్టేషన్, బస్టాండ్, చర్చిల్లో ఆదివారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అనుమానాస్పద వస్తువులు కనిపించినా, గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులను వదిలి వెళ్లినా వెంటనే పోలీసులు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.





ప్రకృతి ఒడిలో ఉల్లాసంగా..

అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. అక్కడి అందాలను తిలకించారు. గుట్టలపై నుంచి పారుతున్న వర్షపు నీటిలో చిన్నారులు ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా గడిపారు. సమీప అడవిలో కలియతిరిగారు. – అనంతగిరి

హరితం.. అలసత్వం

నత్తనడకన ఎనిమిదో విడత హరితహారం

- రెండు నెలల క్రితమే ఏర్పాట్లు పూర్తి
- ఇప్పటి వరకు నాటింది 25 శాతంలోపే..
- వరుణుడు తెరపిచ్చినా తేరుకోని అధికార యంత్రాంగం
- ఈ ఏడాది హరిత లక్ష్యం 40,49,000 మొక్కలు
- 19 శాఖలకు బాధ్యతలు
- నగం శాఖలు దూరం



ఎనిమిదో విడత హరితహారానికి సిద్ధంగా ఉన్న మొక్కలు

వికారాబాద్: జిల్లాలో ఎనిమిదో విడత హరితహారం కార్యక్రమం నత్తనడకను తలపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం ఈ సారి ఇంకా ఊపందుకోలేదు. కొన్ని శాఖలు 25శాతం లక్ష్యాలను పూర్తి చేయగా, సగం శాఖలు ఇంకా పనులను ప్రారంభించనేలేదు. రెండు నెలల క్రితమే అధికార యంత్రాంగం లక్ష్యాలను నిర్దేశించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వర్షాలు తెరపిచ్చినా ఆయా శాఖలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 19న హరితోత్సవాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. గతేడాది 22 ప్రభుత్వ శాఖలను భాగస్వాములు చేయగా, ఈ సారి 19శాఖలకు బాధ్యతలు అప్పగించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో ఎనిమిదో విడత హరితహారం కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా రెండు నెలల క్రితం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సారి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని భావించినా ఇంకా 25శాతం లక్ష్యాన్ని కూడా ఆయా శాఖలు చేరుకోలేదు. సగం శాఖలు ఇంకా పనులే ప్రారంభించలేదు. దీంతో వారి చిత్తశుద్ధి ఏంటో ఇట్టే అర్థమవుతోంది.

లక్ష్య ఛేదనలో అలసత్వం

రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2016లో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఏడు విడతల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సంవత్సరం ఎనిమిదో విడతను పెద్ద ఎత్తున నిర్వహించాలని భావించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 40,49,000 మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది లక్ష్యం 38,70,705 కాగా 28,34,785 మొక్కలు నాటారు. ఇందులో 80శాతం మొక్కలు బతికాయని అధికారులు చెబుతున్నా వాస్తవానికి 50నుంచి 60శాతం మాత్రమే బతికినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 9,61,555 మొక్కలను మాత్రమే నాటారు. ఇండస్ట్రీయల్, మైనింగ్, సివిల్‌సప్లై, ఎక్సైజ్, వ్యవసాయ, మార్కెటింగ్, ఆర్‌అండ్‌బీ, డీడబ్ల్యూఓ తదితర శాఖలు ఇంకా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించలేదు.

566 జీపీలు, 15 ఫారెస్టు నర్సరీల్లో..

జిల్లా వ్యాప్తంగా 581 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో.. 566 గ్రామ పంచాయతీల్లో 38,30000 మొక్కలను పెంచుతున్నారు. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, జీపీలకు 25లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 5లక్షలు, విద్యాశాఖ 11వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ 9,43,500, ఉద్యానవన శాఖకు 2లక్షలు, వ్యవసాయ శాఖకు 5లక్షలు, తాండూరు మున్సిపాలిటీకి 70వేలు, వికారాబాద్ మున్సిపాలిటీకి 80వేలు, కొడంగల్ మున్సిపాలిటీకి 35వేలు, పరిగి మున్సిపాలిటీకి 30వేలు ఇలా 19 ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు.

టమాటాను మించి..

- అమాంతం పెరిగిన అల్లం, వెల్లుల్లి ధరలు
- కిలో అల్లం రూ. 200 నుంచి 250 వరకు..
- అదే బాటలో వెల్లుల్లి



వికారాబాద్ మార్కెట్‌లో అల్లం, వెల్లుల్లి

వికారాబాద్ అర్బన్: టమాటా ధర దిగిరాకముందే అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్ని అంటాయి. గతంలో కిలో వెల్లుల్లి రూ. 50, అల్లం రూ. 80 కాగా.. ఇప్పుడు టమాటా ధర 190ని మించిపోయాయి. కిలో అల్లం రూ. 200 నుంచి 250 వరకు ధర పలుకుతోంది. వెల్లుల్లి ధర కూడా అదే బాటలో పయనిస్తోంది. సామాన్యులను అల్లం, వెల్లుల్లి ఘాటు దగ్గరకు రానివ్వడం లేదు. పది రోజులుగా వీటి ధరలు విపరీతంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. వికారాబాద్ మార్కెట్‌కు సంగారెడ్డి, జహీరాబాద్ మార్కెట్ల నుంచి అల్లం, వెల్లుల్లి సరఫరా అవుతుంది. ఈ ఏడాది డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడంతో ధరలు పెరిగినట్లు తెలిసింది. దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నట్లు వ్యాపారులు చెప్పారు. ధరల పెరుగుదల కారణంగా గల్లీల్లో అల్లం, వెల్లుల్లి విక్రయించే వారు ఆ పని మానేశారు. ఓ వైపు కూరగాయల ధరలు, మరోవైపు వంటకు ఉపయోగించే ఆహార పదార్థాల ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇక్కడి వ్యాపారులు హైదరాబాద్ నుంచి అల్లం, వెల్లుల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా అల్లం, వెల్లుల్లి దిగుబడి తగ్గినట్లు వ్యాపారులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కిలో వెల్లుల్లి రూ. 50, అల్లం రూ. 80 ఉండేది. గల్లీల్లో తిరిగి విక్రయించే వారు రెండు కలిపి కిలో రూ. 100కే ఇచ్చేవారు. మే నెలలో వెల్లుల్లి రూ. 80కి, అల్లం రూ. 150కి చేరింది. జూన్‌లో వెల్లుల్లి రూ. 100నుంచి 120కి, అల్లం రూ. 200కు చేరింది. జూలై నెల ప్రారంభం నుంచి వెల్లుల్లి సైతం రూ. 200, అల్లం రూ. 250 అమ్ముతున్నారు. ఇలా వారం వారం ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సాధారణ రకం అల్లం, వెల్లుల్లి రెండు కలిపి కిలో రూ. 400, మొదటి రకం రూ. 450కి విక్రయిస్తున్నారు. అదే వెల్లుల్లి విడిగా రూ. 200లకు, అల్లం విడిగా రూ. 250 వరకు విక్రయిస్తున్నారు. కూరల్లో అల్లం, వెల్లుల్లి వినియోగం తప్పనిసరి. అయితే వీటి ధరలు అమాంతం పెరగినా తప్పనిసరి పరిస్థితుల్లో కొంటున్నారు.

మా భూములు మాగ్గావాలె..



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

దావుత్‌ఖాన్‌గూడలో భూ నిర్వాసితుల ధర్నా

బడంగ్‌పేట్: తమ భూములు తమకు ఇచ్చేయాలంటూ దావుత్‌ఖాన్‌గూడలో బడంగ్‌పేటకు చెందిన దళితులు ఆదివారం ధర్నా నిర్వహించారు. వృద్ధులతో పాటు చిన్నారులు సైతం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. నిజాం నవాబుల కాలంలో డప్పు కొట్టే దళిత కుటుంబాలకు సుమారు 40 ఎకరాలు కేటాయించారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అదే భూమిని సాగుచేసుకుంటూ దళిత కుటుంబాలు జీవిస్తున్నామన్నారు. బడంగ్‌పేట అభివృద్ధి కార్యక్రమాలకు పోగా ఇంకా 16 ఎకరాలు ఓపెన్‌గా భూమి ఉందని అన్నారు. ఈ భూమిని కబ్జాలో ఉన్న దళిత కుటుంబాలు ఇళ్ల నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని అన్నారు. మీర్‌పేట పోలీసులు దావుత్‌ఖాన్‌గూడకు చేరుకుని ధర్నా చేస్తున్నవారిని అరెస్ట్ చేసి హయత్‌నగర్ పీఎస్‌కు తరలించారు. అరెస్ట్ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, ఎల్‌బీనగర్ బీఎస్పీ నాయకులు స్టేషన్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బాధితులకు అండగా ఉంటాం

అబ్దుల్లాపూర్‌మెట్: బడంగ్‌పేట రెవెన్యూ పరిధిలోని దావుత్‌ఖాన్ గూడలో ఆందోళన చేస్తున్న దళితులను మీర్‌పేట పోలీసులు హయత్‌నగర్‌కు తరలించారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పార్టీ నాయకులతో కలిసి వచ్చి బాధితులకు అండగా నిలిచారు. పోలీసులు ఆయనను బయటికి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇదే సమయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హయత్‌నగర్ పీఎస్‌కు వచ్చి బాధితులను పరామర్శించారు. అనంతరం ఈటల రాజేందర్, అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. బాధితులకు అండగా ఉంటామని, దళితులపై ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంత్రి తమ అనుచరులకు ఈ భూములను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాయకులు చింతల సురేందర్ యాదవ్ తదితరులు పాల్గన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి
- టీఎస్సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షురాలు స్థితప్రజ్ఞ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షురాలు స్థితప్రజ్ఞ అన్నారు. టీఎస్సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఆదివారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు సీపీఎస్ ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబ దేవాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ ముఖ్యకూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళుర్పించారు. అనంతరం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య రెండు లక్షలకు చేరిందని, ఉద్యోగులందరు ముక్తకంఠంతో సీపీఎస్ రద్దును కోరుకుంటున్నారని అన్నారు. గతంలో చేపట్టిన పోరాటాల ఫలితంగా సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ సౌకర్యం, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అభీ నహీతో.. కభీ నహీ నినాదంతో పాత పెన్షన్ సాధనకోసం సంకల్ప రథయాత్రను చేపట్టినట్టు చెప్పారు. రాజస్థాన్, ఛత్తీస్ఘడ్, పంజాబ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఓపీఎస్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎస్సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దర్శన్‌గౌడ్, పవన్, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాగ్నా నది దాటబోయి..



కాగ్నా దాటేందుకు ప్రయత్నిస్తున్న అంజిలయ్య



నదిలో కొట్టుకపోతూ..



ప్రాణాలతో బయటపడి..

- ప్రాణం మీదకు తెచ్చుకున్న అంజిలయ్య
- కాపాడిన గ్రామస్తులు, హిటాచీ డ్రైవర్

ధారూరు: కాగ్నా నదిని దాటే క్రమంలో ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు, హిటాచీ డ్రైవర్ ఆ వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఈ సంఘటన మండలంలోని స్టేషన్ ధారూరు – దోర్నాల్ గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు కథనం మేరకు.. రాస్నం గ్రామానికి చెందిన గంజాయి అంజిలయ్య(40) ఆదివారం ధారూరుకు బయలుదేరాడు. దోర్నాల్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నా నదిని దాటేందుకు ప్రయత్నించాడు. నది మధ్యలోకి వెళ్లగానే నీటి ప్రవాహానికి ముందుకు కదలలేకపోయాడు. అక్కడే ఉన్న సాయప్ప, అనంత్‌రెడ్డి వెనక్కి రావాలని పిలిచారు. ఎటూ వెళ్లలేని స్థితిలో ఉండగా నీటి ప్రవాహానికి అంజిలయ్య కొట్టుకుపోయాడు. గమనించిన సాయప్ప, అనంత్‌రెడ్డి వెంటనే నదిలోకి దూకి అతి కష్టం మీద అంజిలయ్యను ఒడ్డుకు చేర్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు రాగానే అతన్ని వారికి అప్పగించారు. అంజిలయ్యను కాపాడిన సాయప్ప, అనంత్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

కాగ్నా నదిపై 2017లో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించినా ఇంతవరకు పూర్తి చేయలేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి ఆరోపించారు. ప్రాణాలు పోతున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, లేకుంటే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ


చోరీకి గురైన ట్రాలీ ఇదే (ఫైల్)

మోమిన్‌పేట: పొలం వద్ద ఉన్న ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మోమిన్‌పేట మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన పోలీస్ మల్లారెడ్డికి చెందిన ట్రాక్టర్, ట్రాలీతో సహా తన వ్యవసాయ పొలం వద్ద ఎప్పటిలాగే ఉంచేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 19న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టీఎస్34 ఎఫ్6577 నంబరు గల ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించారు. బాధితుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా ఆకు పచ్చని రంగు గల ట్రాక్టర్.. శంకర్‌పల్లి వైపు నుంచి వచ్చి.. ట్రాలీని తగిలించుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

లారీని ఢీ కొని.. వాహనదారుడి మృతి

నందిగామ: అకస్మాత్తుగా లారీని ఒక వైపునకు మళ్లించడంతో లారీని ఢీ కొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. చౌదరిగూడ మండలం గుంజల పహాడ్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్(40) నందిగామ శివారులోని క్రియేటివ్ పాలిఫ్యాక్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీకని బైక్‌పై నందిగామ నుంచి కొత్తూరువైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తహసీల్దారు కార్యాలయం ఎదురుగా టీ టైం హోటల్ పక్కన లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ వేయకుండా అకస్మాత్తుగా లారీని ఒక వైపునకు మళ్లించాడు. దీంతో వెనుకాలే వస్తున్న శ్రీనివాస్ తన బైక్‌తో లారీకి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వడ్ల సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి పశువు మృతి


పాడి పశువు కళేబరం

షాబాద్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొనగిరిపల్లి గ్రామానికి చెందిన లింగాల బాలయ్య తన పాడి గేదెకు మేత మేయించడానికి ఆదివారం పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ ఫెన్సింగ్ వైర్ తగలడంతో మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.75వేల వరకూ ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు లింగాల బాలయ్య కోరాడు.

లారీ ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ దేవకి తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని యువకుడు(26) రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలోని ఓ దాబాహోటల్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల వైపునుంచి షాద్‌నగర్ వైపునకు వెళుతున్న లారీ ఆ యువకుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలకోసం ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పూర్తి సమాచారం కోసం పోలీసులను సంప్రదించాలని కోరారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడుగడుగునా గండం!

ఏకధాటి వర్షాలకు ధ్వంసమైన రహదారులతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. వాహనం నడపాలన్నా.. వాటిల్లో ప్రయాణించాలన్నా ఒళ్లు హూనం అవుతోంది. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఉన్నట్టుండి రోడ్లపై వెహికల్స్ ఆగిపోతుండటంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత్యంతరం లేక గతుకుల రోడ్లపై పయనిస్తున్నామని, ఇన్ని గండాలు దాటి.. గమ్యం చేరగలమా? అని ప్రజలు వాపోతున్న వైనంపై 'సాక్షి' కథనం..

- దారిపొడవునా గోతులు.. మోకాలి లోతులో నీరు
- గత్యంతరం లేక గతుకుల రోడ్డుపై పయనం
- గమ్యం చేరేందుకు వాహనదారుల అష్టకష్టాలు
- ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు


బంట్వారం: ఎన్నారం–కోట్‌పల్లి రోడ్డు దుస్థితి

బంట్వారం: రహదారులు అధ్వానంగా మారాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో 80 కిలో మీటర్లకు పైగా ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. బంట్వారం నుంచి తొర్మామిడి, ఓగులపూర్–రొంపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కోట్‌పల్లి, మర్పల్లి రోడ్డులో పూర్తిగా గోతులు ఏర్పడ్డాయి. ఎన్నారం గుట్ట దగ్గర వాహనాలు ముందుకు వెళ్లని దుస్థితి. కరీంపూర్ నుంచి మైలార్‌దేవరంపల్లి రూటులో కంకర తేలి, గుంతలు పడ్డాయి. కోట్‌పల్లి, వికారాబాద్ మార్గం, మోత్కుపల్లి, కొత్తగడి రోడ్డు దుస్థితి అదే. రెండేళ్ల కిందట రూ.9.5 లక్షలతో అక్కడక్కడ ప్యాచ్ వర్క్ చేసినప్పటికీ.. మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇలాంటి గతుకుల రోడ్లపై వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని కల్వర్టులు

మూడేళ్ల కిందట కూలిన కల్వర్టులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. బంట్వారం, రొంపల్లి, ఎన్కెపల్లి రూట్లలో కల్వర్టులు కూలిపోయాయి. అటుగా భారీ వాహనాలు వెళితే దిగబడే ప్రమాదం ఉంది. కల్వర్టులు ధ్వంసమై మూడేళ్లు అయినా మరమ్మతులు చేపట్టడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవటం గమనార్హం.

నిధులు వచ్చాయి

రెన్యువల్ పనులకు సంబంధించి రూ.2.72 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. కొన్నింటికి అగ్రిమెంటు కాలేదు. ప్రస్తుతానికి కోట్‌పల్లి–మొరంగపల్లి రోడ్డు పనులు జరుగుతున్నాయి. కొత్తగడి–బంట్వారం రోడ్డుకు రూ1.5 కోట్లు, కోట్‌పల్లి–మొరంగపల్లి రోడ్డుకు 1.25 కోట్లు, అంతగిరిపల్లి–మోత్కుపల్లి రోడ్డుకు రూ.42 లక్షలు వచ్చాయి. ఈ నిధులతో ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేయిస్తాం.

– శ్రీనివాస్, డీఈ ఆర్‌అండ్‌బీ, బంట్వారం

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు


నాగసముందర్ గేటు ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

యాలాల: ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. యాలాల మండలం కమాల్‌పూర్–బాగాయిపల్లి, యాలాల, లక్ష్మీనారాయణపూర్ నుంచి తిమ్మాయిపల్లి వరకు ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలిచాయి. కమాల్‌పూర్ నుంచి నాగసముందర్ గేటు మీదుగా బాగాయిపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డులో మొత్తం గోతులు ఏర్పడ్డాయి. సుమారు 5కిలో మీటర్లు వరకు ఇలాగే ఉంది. లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల, తిమ్మాయిపల్లి గేటు వరకు ఉన్న రోడ్డు ధ్వంసమైంది. కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి మీదుగా భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ మార్గంలో హైదరాబాద్‌తో పాటు షాద్‌నగర్, పరిగి, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు సైతం వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. తాండూరు నుంచి ముద్దాయిపేట వరకు ఉన్న 22కిలో మీటర్లు డబుల్ రోడ్డు ఉన్నప్పటికీ.. మధ్యలో కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు 5కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.


బీజేఆర్ చౌరస్తాల్లో రోడ్డు దుస్థితి

వర్షం ఆగినా..

వికారాబాద్ అర్బన్: నిన్నమొన్నటి వరకు కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ కూడలి వెళ్లే రోడ్డు ఓ చోట రోడ్డు ధ్వంసమైంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా పట్టణంలోకి వచ్చే రైల్వే బ్రిడ్జిపై మూల మలుపులో రోడ్డు గుంతలు పడింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండటంతో.. స్థానికులు ఆ గుంతలో బండరాళ్లను వేసి కొంత ప్రమాద తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నరక ప్రయాణం


కంకర తేలిన గూడూర్–శివారెడ్డి రోడ్డు

దోమ: దోమ మండలం గూడూర్ నుంచి శివారెడ్డిపల్లి గ్రామానికి వచ్చే మెటల్ రోడ్డు ప్రస్తుత వర్షాలతో కంకర తేలి, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కొన్నేళ్లుగా ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉన్నా.. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక అత్యవసర పరిస్థితితులు ఏర్పడితే.. ఇతర మార్గల నుంచి వెళ్లాల్సి వస్తోందని, తద్వారా దూరభారంతో పాటు, సమయం వృథా అవుతోందని పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఇప్పటికైనా బీటీరోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు సాయికుమార్

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్య మవుతుందని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పుట్నాలసాయికుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆదివారం ఏబీవీపీ షాద్‌నగర్ నగరశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో వారి త్యాగాలకు తూట్లు పొడిచే విధంగా పాలన కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా విధ్వంసానికి గురైందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే మన ఉద్యోగాలు మనకే వస్తాయని ఆశించిన నిరుద్యోగులకు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిరాం, రాకేష్, జగదీష్, పవన్, నవీన్, సాయి, శ్రీకాంత్, బన్నీ, శివ, అభిషేక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రామారావు

షాద్‌నగర్: రాష్ట్రంలో పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రామారావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో ఎంతో మంది పేదలు ఉన్నారని వారిని గుర్తించి ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు. ఇళ్లులేని నిరుపేద బ్రాహ్మణులకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని, 60సంవత్సరాల వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆగస్టు 15న ఏర్పాటుచేసే నియోజకవర్గ స్థాయి బ్రాహ్మణ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సుధాకర్‌శర్మ, చిదంబరశర్మ, వేణుగోపాల్‌రావు, రామసత్యనారాయణశర్మ, భానుశర్మ, నర్సింహ్మశర్మ, వెంకటాచార్యులు, మాదిరాజుప్రవీణ్, కిరణ్‌కుమార్, శివసాయిశర్మ, నరేందర్‌రావు ఉన్నారు.

హెచ్చరించినా లెక్కచేయకుండా..


అలుగు వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

కోట్‌పల్లి జలాశయం
అలుగు వద్ద సందర్శకుల రద్దీ

ధారూరు: జలకళతో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు వరకు ఎవరూ వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అన్ని దారులకు అడ్డంగా కందకాలు తవ్వారు. వాహనాలు, కాలినడకన కూడా పోకుండా పోలీసులు మోహరించారు. అయినా పర్యాటకులు జలాశయం చూడాలన్న ఆశతో.. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తొలుత అనంతపద్మనాభ స్వామి దర్శనం చేసుకున్నాక.. ప్రాజెక్టుకు వద్దకు వచ్చి అలుగు వద్ద సందడి చేస్తున్నారు. పైగా సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి అధికంగానే ఉంది. పోలీసులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎవరినీ రానివ్వకుండా కట్టడి చేశారు. సాయంత్రం వేళ పోలీసులు వారించినా.. ససేమిరా అంటూ సందర్శకులు అలుగు వద్ద సరదాగా గడిపారు. దీంతో పోలీసులు ప్రేక్షక పాత్రం పోషించడం గమనార్హం.

'అంగన్‌వాడీల'పై కోతుల దాడి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న బుగ్గరాములు


కోతుల దాడిలో గాయపడిన ఆయా

టీచర్, ఆయాలకు గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: కోతులు గుంపులుగా వచ్చి అంగన్‌వాడీలో చొరబడి ఆయా, టీచర్‌పై దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..రాయపోల్ గ్రామంలో ఓడీఎఫ్ బృందం పర్యటిస్తుండగా అంగన్‌వాడీ కేంద్రానికి వస్తారేమోనని అంగన్‌వాడీ టీచర్ భారతమ్మ, ఆయా తాహెరబేగంలు అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసి శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా తాహెర బేగం బయటకు వచ్చి చెత్త పడేస్తుండగా ఒక్కసారిగా కోతుల గుంపు వెంబడించింది. అంగన్‌వాడీలోకి వెళ్తుండగా టీచర్ భారతమ్మ అడ్డు వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరిపై కోతుల గుంపు దాడి చేశాయి. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు

కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఐటీయూ మండల కార్యదర్శి బుగ్గరాములు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు.

ఆరోగ్యం.. జర భద్రం

అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. డెంగీ, మెదడువాపు, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు దోమతెరలు వాడాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తతతోనే రక్ష

- అవగాహనతోనే సీజనల్ వ్యాధులు దూరం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి


షాబాద్‌లో ఇండ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు

షాబాద్: కూలెక్స్ దోమ వలన మెదడు వాపు వ్యాధి వస్తుంది. దోమ కుట్టిన పది రోజుల్లోపు లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా 1నుంచి 14 ఏళ్ల పిల్లలకు వచ్చే అవకాశముంది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అసాధారణంగా కళ్లు తిరుగుతాయి. పక్షవాతానికి గురయ్యే ప్రమాదముంది. వాంతులు, విరేచనాలు అవుతాయి.

జాగ్రత్తలు ఇలా..

దోమ తెరలు తప్పనిసరిగా వాడాలి. దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులు, సన్నటి జాలీలతో బిగించుకోవాలి. జనావాసాల మధ్యన పందులు సంచరించకుండా చూసుకోవాలి. మురుగు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలి. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.

బోదకాలు లక్షణాలు..

తరచూ కొద్దిపాటి జ్వరం, ఆయాసం వస్తే బోదకాలు ప్రాథమిక లక్షణాలు. పురుషులలో వరిబీజం ఏర్పడుతోంది. గజ్జల్లో వాపు వస్తోంది. నిర్ధారణకు రాత్రి సమయంలో రక్త నమూనాలు సేకరిస్తారు. బాధితుడు విశ్రాంతి సమయంలో పరాన్న జీవులు రక్త ప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశిస్తాయి. 5 నెలల్లో ప్రౌఢ జీవులుగా వృద్ధి చెందుతాయి. ఇలా శరీరంలో 6ఏళ్ల పాటు జీవించే ఈ పరాన్న జీవులు లక్షల సంఖ్యలో ఉత్పత్తయి శోషణ వ్యవస్థలోకి చేరతాయి. దీంతో శరీర అవయవాలు అసాధారణ వాపునకు గురవుతాయి.

జాగ్రత్తలు..

నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఈ మాత్రల ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోంది.

చికెన్ గున్యా లక్షణాలు..

చికెన్ గున్యా జ్వరం పగటి పూట కుట్టేపులి దోమ ద్వారా వస్తోంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్ల నొప్పులుంటాయి. ఈ వ్యాధి సోకినప్పుడు భరించలేని ఒళ్లు, కీళ్ల నొప్పులు, జలుబు ఉంటుంది. వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

డెంగీ లక్షణాలు..

ఏడీస్ ఈజిప్టి వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతోంది. దోమ కుట్టిన తర్వాత 5 నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తోంది. తలనొప్పి అధికమవుతోంది. కంటి కదలికల సమయంలో భరించలేని నొప్పి ఉంటోంది.

మలేరియా లక్షణాలు..

సాయంత్రం పూట జర్వం రావడం, చలి వణుకు ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి చికిత్స చేయించాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి.

దోమ తెరలు వినియోగించాలి



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్ వేప రేంజర్ల కన్నా దోమ తెరలు వినియోగిస్తే ఫలితం ఉంటుంది. ముఖ్యంగా పరిసరాలతో పాటు వ్యక్తిగతంగానూ పరిశుభ్రత పాటించాలి.

– డాక్టర్ వరలక్ష్మి, చందనవెళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

ఏడుగురి అరెస్ట్


పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసిన సంఘటన చర్లపటేల్‌గూడ శివారులో ఆదివారం జరిగింది. ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపటేల్‌గూడ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. చర్లపటేల్‌గూడకు చెందిన ఆర్.శ్రీశైలం, మల్లేష్, శ్రీనివాస్, ఎస్.జంగయ్య ఎంపీపటేల్‌గూడకు చెందిన శ్రీనివాస్, పి.బాల్‌రాజ్, పోచారానికి చెందిన డి.రామకృష్ణలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.27,360 నగదు, మూడు సెట్ల కార్డులు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైభవంగా రుక్మిణీ పాండురంగడి కల్యాణం


స్వామివారి కల్యాణం చేస్తున్న బ్రాహ్మణులు

తాండూరు: బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పట్టణంలోని సీతారాంపేట్ పాండురంగ స్వామి దేవాలయంలో జరిగిన వేడుకల్లో బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా పంచసూక్తముల హోమం, నవగ్రహాల పూజ, గణపతి హోమం నిర్వహించారు. దేవతామూర్తుల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు గురురాజ్ దీక్షిత్, ప్రధాన కార్యదర్శి గురురాజ్ జ్యోషి, సమాజం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరణం పురుషోత్తంరావు, సమాజం ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, గోనూర్ రాఘవేందర్, సర్వోత్తమరావు, మాణిక్‌రావు, సంజీవరావు, భీంసేన్‌రావు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మహిళలు